దేవుడికి
నిలువుదోపిడీ
ఇచ్చుకునే మనిషి
దేవుడిలాంటి మనిషిని
ఎందుకు ఆదరించడు

# నిలువు దోపిడీ

పెన్మెత్స శ్రీకాంతరాజు కథ

అదేమిటి స్వామీ... అకారణంగా నవ్వుతున్నారు...'' వైకుంఠంలోని విష్ణుమూర్తిని అడిగింది లక్ష్మీదేవి.

''అకారణంగా కాదు దేవీ! సకారణంగానే... అటు చూడు'' భూలోకంవైపు చూపించాడు విష్ణుమూర్తి.

◇ ◆ ◇

''ఈవేళ సాయంత్రమే మా తిరుపతి ప్రయాణం. మా బాబుకి పుట్టువెంట్రుకలు తీయించడానికి తీసుకెళ్తున్నాము. మేము వుండకపోయినా పాలేరు రంగడు ఇంటిని కనిపెట్టుకుని వుంటాడు. నువ్వు రోజూ వచ్చి వీధిగుమ్మం పాచి చేసి, చిన్న ముగ్గు వేసి పోతూ వుండు'' అంది అనసూయ.

''అలాగేనండి అమ్మగారు! ఎన్నిరోజులకి తిరిగొస్తారు?'' అడిగింది పనిమనిషి.

''ఏమోనే! మీ అయ్యగారి మనసు బాగుంటే కాళహస్తీ, శ్రీశైలంకూడా చూపిస్తారు. లేకపోతే తిరుపతి ఒకటే చూపి వచ్చేస్తాం''

''నేను వెళ్లొస్తాను అమ్మగారు...'' పనిమనిషి వెళ్లిపోయింది.

''సాయంత్రమే ప్రయాణం! ఇంకా ఏమీ సర్దుకోలేదు...'' అనుకుంటూ అనసూయ పడకగదిలోకి వెళ్లింది. బట్టలు తీద్దామనే ఉద్దేశ్యంతో బీరువా తెరవబోతూ అనసూయ యధాలాపంగా మంచంవైపు చూసి బిగుసుకుపోయింది.

''కెవ్వున...'' రాబోయిన కేకను గొంతులోనే నొక్కిపట్టి గదిలోంచి ఇవతలికొచ్చేసింది. ఆమెకి క్షణంలో ఒళ్లంతా ముచ్చెమటలు పట్టేశాయి. గొంతులోంచి మాట



బయటకు రావడంలేదు. గజగజా వణికిపోసా గింది.

పనిమనిషి వెళ్ళిపోయింది. పాలేరు రంగడు పొలానికి పోయాడు. భర్త ఇంట్లో లేదు... అందుబాటులో ఎవరూ లేరు.

కూరలు కొనడానికికూడా ఎప్పుడూ బయటకు రాని అనసూయ... రోడ్డుమీదకొచ్చేసి హిస్టీరియా పట్టినదానిలా అరిచింది...

"పాము బాబోయ్ పాము..." అని!

రోడ్డుమీదున్నవాళ్ళు ఒక్క క్షణం ఆశ్చర్యపోయారు. ఎదురింటి అరుగుమీద కూర్చున్న ఇద్దరు ఆడవాళ్ళు పరుగెట్టుకొచ్చి... "ఏమైంది అనసూయ వదినా?" అని అడిగేరు.

తన ఇంటివైపు వ్రేలుపెట్టి చూపిస్తూ "పాము... బాబు..." అంది అనసూయ! అంతకంటే మాట్లాడలేనట్లు...

"నువ్వు అలా కంగారుపడకు! ఏం జరిగిందో అర్థమయ్యేలా చెప్పు" అందావిడ. అనసూయ వాళ్లని తనతోబాటు పడుకున్న గది దగ్గరకు తీసుకెళ్లింది. అక్కడ...

బాబు మంచంమీద పడుకుని వున్నాడు. బాబు మంచంమీంచి క్రింద పడకుండా వుండేందుకు అడ్డుపెట్టిన తలగడమీద పడుకుని వుందో నల్లత్రాచు చుట్టలు చుట్టలుగా చుట్టుకుని హాయిగా పడుకుని వుందది.

క్షణంలో ఆ వార్త ఆ వీధి అంతటికీ పాకింది. ఆ ఇంటిముందో గుంపు ఏర్పడింది. ఇంతలో అనసూయ భర్త రాఘవరావు వచ్చేడు. భర్తని చూడగానే అనసూయ ఘొల్లుమంది. "ఏమండీ! మన బాబు..." అంటూ వెక్కి వెక్కి ఏడ్వసాగింది. అతను మౌనంగా ఆ గది గుమ్మం దగ్గరకెళ్లి చూశాడు. పాముకీ అర అడుగు దూరంలో నిద్రపోతున్న కొడుకుని చూడగానే అతని ధైర్యం దిగజారిపోయింది. పాలిపోయిన ముఖంతో బయటకొచ్చాడు.

ఆ గుంపులో ఒక్కొక్కరే వస్తున్నారు... నిశ్శబ్దంగా పాముని, బాబుని చూసి వెనుదిరుగుతున్నారు.

"అంతకు పదిరెట్లు పెద్ద పాము వచ్చినా నిమిషంలో చంపేద్దును! కాని ప్రక్కన బాబున్నాడు. చటుక్కున వెళ్లి బాబును ఎత్తుకొచ్చేద్దామన్నా... ఆ క్షణంలోనే పాము నిద్రలేచి... పడగెత్తి కాటేయవచ్చు! పోనీ మామూలు పామైతే కాటేసినా పర్లేదు. మందులేసుకోవచ్చు! అది మామూలు పాముకాదాయె. కృష్ణపాదాలున్న నల్లత్రాచు...' ' బాబు ప్రక్కన వున్న పాముని చూసి వచ్చి వాపోయాడు పాలేరు రంగడు.

"అవును ఇప్పుడా పిల్లోడు కదిలినా, ఏడ్చినా పాముకి నిద్రాభంగమై లేస్తుంది" అన్నాడు ప్రక్కింటి రామయ్య.

"పాములు పట్టేవాళ్లని పిల్చుకురండి" ఎవరో సలహా ఇచ్చేరు. అది విని గుంపులోనుండి ఇద్దరు యువకులు సైకిల్ మీద వెళ్లేరు పాములు పట్టే యానాదివాళ్లని తీసుకురావడానికి.

రాఘవరావు మనసు పరిపరివిధాలుగా ఆలోచిస్తోంది! ఆ పాము బారినుండి బాబుని రక్షించడం ఎలా?

రాఘవరావు ఆ ఊరి మోతుబరులలో ఒకడు.

వంద ఎకరాల మాగాణి, మండువా ఇల్లు, ఇంకా లక్షలాది రూపాయల ఆస్తులు అతని స్వంతం!

రాఘవరావుకి పాతికేళ్ల వయస్సప్పుడు, పద్దెనిమిదేళ్ల అనసూయతో పెళ్లి అయింది. ఏళ్లు గడుస్తున్నా...వాళ్లకి సంతానం లేదు. వాళ్లు పిల్లలకోసం మొక్కని దేవుడు లేదు. వెయ్యని పూజలేదు. కలవని డాక్టర్ లేదు!

అనసూయ, రాఘవరావు... పిల్లలు లేకపోవడంతో తీవ్రమైన మానసిక వ్యధకి గురయ్యారు.

అలాంటి సమయంలో వారి పెళ్లయిన ఇరవై సంవత్సరాలకి, ముప్పై ఎనిమిదేళ్ల అనసూయ గర్భం దాల్చింది. ఆ దంపతుల ఆనందానికి హద్దులేదు.

వారు ఆశించినట్టే పండంటి మగబిడ్డ పుట్టేడు.

కాని అనసూయకి కాన్పు చాలా కష్టమైంది. అతి కష్టంమీద తల్లీ, బిడ్డా గండం గట్టెక్కి బయటపడ్డారు. ఇంకోసారి గర్భం దాలిస్తే తల్లి ప్రాణానికి ప్రమాదం తప్పదని... డాక్టర్ అనసూయకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేసేసింది.

ఇప్పుడు ప్రమాదంలో చిక్కుకున్న ఆ బాబుకోసం తామెన్ని కష్టాలు పడ్డారో గుర్తొచ్చేసరికి రాఘవరావు కళ్లలో నీళ్లు తిరిగాయి.

''భగవాన్... నా బాబుని కాపాడు...'' దైవాన్ని కోరుకున్నాడు రాఘవరావు.

రాఘవరావు మగాడు కనుక తనని తాను సంబాళించుకోగలుగుతున్నాడు. కాని అనసూయ పరిస్థితి వేరేవిధంగా వుంది.

బాబు ప్రక్కన పాముంది అనే సంగతి ఆమెని నిలువెల్లా వణికిస్తోంది.

''తన నోముల పంట! వరాల మూట... సంవత్సరాల తన ఆశల ఫలితం... బాబు! బాబుకేమన్నా అయితే తను జీవించి వుండదం కల్ల!

గొడ్డుబోతురాలని అందరూ ఎగతాళిగా అంటుంటే ఎంతలా కృంగిపోయేది?! బాబు పుట్టాకేకదా... తను నలుగురిలో గర్వంగా తలెత్తుకోగలుగుతుంది.


పిల్లలకోసం తను ఎన్ని దేవుళ్లకి మొక్కింది.

ఎన్ని గుళ్లచుట్టూ అంగప్రదక్షిణలు చేసింది.

ఎన్నిరోజులు కటిక ఉపవాసాలు చేసింది!

ఎన్ని మందులు, ఇంజెక్షన్లు, ఆపరేషన్లు... ఎన్నెన్ని అవస్థలు! ఇరవై సంవత్సరాలు! సుదీర్ఘమైన రెండు దశాబ్దాల తర్వాత... కటిక చీకటి నిండిన జీవితంలో కాంతిరేఖ...

## టెస్టింగ్!



తండ్రీ కొడుకులు సంతకు వెళ్లారు.

''నాన్నా నాన్నా అతను ఆ ఎద్దును ఎందుకు నిమురుతూ కొట్టి గిల్లుతున్నాడు''

''వాడు దానిని కొంటాడనుకుంటాను. బాగా కండపట్టిందో లేదో చూస్తున్నాడు'' చెప్పాడు తండ్రి.

మర్నాడు మధ్యాహ్నం కొడుకు పరుగుపరుగున తండ్రి దగ్గరకొచ్చాడు.

''నాన్నా నాన్నా... మరేం... ప్రక్కింటి రాజులేడూ... వాడు మన అక్కని కొనేస్తున్నాడు మనిద్దరం... రా చూద్దాం''

— కె.వి.మధుసూదనరావు (కాకినాడ)

బాబు!

బాబుని చేతుల్లోకి తీసుకోగానే ఇరవై సంవత్సరాలు అనుభవించిన కష్టాలు ఈ సంతోషంముందు అల్పంగా అన్పించేయి. వాడు పుట్టిన తర్వాత... ఈ ఎనిమిది నెలల్లో వాడికి రొంప వస్తే తన గుండె దడదడా కొట్టుకువేది. వాడికి కాస్త నలతగా వుంటే తనకి భయంతో జ్వరం వచ్చేది!

ఇంత అపురూపంగా వాడిని తను పెంచుకొస్తుంటే... ఇప్పుడు వాడి ప్రక్కన యమపాశంలా పాము దాపురించింది...'' అనసూయ దుఃఖం క్షణక్షణానికి పెరుగుతోంది!

పాములు పట్టేవాళ్లకోసం వెళ్లిన ఇద్దరు యువకులు తిరిగొచ్చేరు. "యూనాదిగూడెంలో ఎవరూ లేరు. అందరూ కాలవలో చేపలు పట్టడానికి వెళ్లేరు. పక్క ఊరులో ఎవరైనా పాములు పట్టేవాళ్లు వున్నారేమో కనుక్కురమ్మంటారా?'' అడిగేరు వాళ్లు.

"నా మోటార్‌సైకిల్ తీసుకెళ్లండి. పాములుపట్టేవాళ్లు ఎవరున్నా దొరికితే ఎక్కించుకుని వెంటనే తీసుకురండి'' అన్నాడు రాఘవరావు.

వాళ్లు మోటర్‌సైకిల్ ఎక్కి నిష్క్రమించేరు.

"ఆ మాయదారి పాము ఎక్కడా చోటే లేనట్టు... బాబు ప్రక్కనే పడుకోవాలా?! పాపం అనసూయ ఆ బిడ్డకోసం ఎన్ని కష్టాలు పడింది...'' ఎవరో ఇంకొకరితో అంటున్నారు.

రాఘవరావు నలుగురు మనుషులని తలకోదిక్కూ పంపేడు. పాములు పట్టే వాళ్లనన్నా... పాముల మంత్రగాళ్లనన్నా తీసుకురమ్మని.

ఇంతలో పాములు పట్టేవాళ్లని తీసుకొచ్చేరు ఎవరో, వాళ్లని పాము ఉన్న గది దగ్గరకు తీసుకెళ్లాడు రాఘవరావు. వాళ్లు పరిస్థితిని పూర్తిగా ఆకళింపు చేసుకుని... రాఘవరావుతో ఇలా అన్నారు... "పాము తలని మేము సన్నటి వెదురుకర్రతో నొక్కి... చేత్తో దాని తలని పట్టుకుని బంధిస్తాం! కాని పాము మెత్తటి దిండుమీద వుండడంవల్ల 'నొక్కడం'లో పట్టు వుండదు. అది తిరగబడి బాబునికాని, మమ్మల్నికాని కాటేయవచ్చు! అది నిద్రలోంచి లేస్తే దానంతట అదే క్రిందకొచ్చేస్తుంది. అప్పుడు దాన్ని మేం తేలిగ్గా పంపేస్తాం...''

మౌనంగా తలూపాడు రాఘవరావు. "ఏడుకొండలవాడా... నీ దగ్గరకి ప్రయాణమైన మాకు ఏమిటీ పరీక్ష? బాబుని ఈ గండంనుంచి గట్టెక్కించు. ఆ పాము తనంతట తానే మంచం దిగేటట్టు చూడు తండ్రీ!'' మనసులో వేడుకున్నాడు రాఘవరావు.

పాములవాళ్లు వచ్చికూడా ఏమీ చెయ్యలేకపోవడంతో అనసూయకు అర్థమైంది... తన బాబుని కాపాడే శక్తి కేవలం దైవానికే వుందని!

"తండ్రీ ఆపద మొక్కులవాడా... నా మొర ఆలకించి, పెళ్లయిన ఇరవై ఏళ్లకి నన్ను తల్లిని చేశావు! ఆ బిడ్డ నీవునాకు ఇచ్చిన వరం! వాడిని కాపాడాల్సిన భారం నీదే... వాడికీ గండం తప్పిస్తే నిలువుదోపిడీ నీకిస్తాను...'' భక్తిగా మొక్కింది అనసూయ. అప్పుడామె వంటిమీద ఆరు జతల గాజులు, నాలుగు పేటల పలకసర్లు, రెండు

పేటల పుస్తెలతాడు, రవ్వల దుద్దులు వున్నాయి. వాటి ఖరీదు లక్ష రూపాయల పైనే వుంటుంది.

పాములు పట్టేవాళ్లు పాము ఎప్పుడు కదులుతుందా అని గమనిస్తూ గది గుమ్మం దగ్గరే నిలబడి వున్నారు. నిమిషాలు నిశ్శబ్దంగా గడుస్తున్నాయి. రాఘవరావుకి టెన్షన్ పెరిగిపోసాగింది. రక్తం నరాలు చిట్లిపోయేంత వేగంగా ప్రవహిస్తోంది.

ఇంతలో ఆ దారివెంట వెళ్తున్న ఓ వ్యక్తి... అక్కడున్న గుంపుని చూసి ఆగేడు. సంగతి తెలుసుకుని ఆ ఇంట్లోకి అడుగుపెట్టేడు. అతనికి ఇంచుమించు ముప్పై సంవత్సరాలుంటాయి. అతని శరీరం నల్లగా వుంది. ఐదూ ఎనిమిదంగుళాల పొడవుంటాడు. తైల సంస్కారం లేని జుట్టు చిందరవందరగా వుంది! చిన్న కళ్లు... సన్నటి మీసం...

అతను బొడ్డుకి మూడంగుళాలు క్రిందికి జారిన తెల్లటి గుడ్డని మొలతాడుకి చుట్టి గోచీ పెట్టుకున్నాడు. ఆ గోచీ తప్ప అతని వంటిమీద మరే ఆచ్ఛాదనా లేదు! అతని విశాలమైన ఛాతిమీద ఒత్తుగా రోమాలున్నాయి. అతని దండలు మెలితిరిగి వున్నాయి. చేతులు దళసరిగా వున్నాయి. బహుశా పని ఎక్కువగాచెయ్యడంవల్ల అలా తయారైవుంటాయి.

అతను పామున్న గదిగుమ్మంబయట నిలబడ్డాడు.

ఇంతలో పాము చిన్నగా కదిలింది. అనసూయా, రాఘవరావు, పాములవాళ్లు, చూడడానికి వచ్చినవాళ్లు అందరూ బిగుసుకుపోయారు.

పాము నెమ్మదిగా పడగెత్తి నిలబడింది. దాని పడగమీద కృష్ణపాదాలు అందరికీ స్పష్టంగా కనిపించేయి. పాము తన చిన్నికళ్లను చురుకుగా కదిలిస్తూ నాలుగువైపులా చూడసాగింది. క్షణాలు గడుస్తున్నాయి. పాము పడగని కదిలిస్తూ చుట్టూ చూస్తోందేతప్ప... అక్కడ్నుంచి వెళ్లిపోయే ప్రయత్నం

## సాత్త్విక దేవాలయం



పూరీ జగన్నాథ్ దేవాలయం పరిసర ప్రాంతాలు కళ్లెదుట మాంసముద్దలుగా మారిపోయాయట! ఆ దేవాలయం గోడమీద ఇకముందు సినిమా పాటలు వినిపించరాదనీ, మాంసం, చేపలు, గుడ్లు అమ్మరాదనీ దేవాలయ అధికారులు ఆంక్షలు విధించారు. లేకుంటే వారు ఎక్కువగా భక్తిపాటలు వేసుకోవచ్చు! అంటే దేవాలయం చుట్టుపక్కల నివసించేవారంతా సాత్వికులుగా మారిపోవాలన్న మాట! ఈ మధ్యనే పూరీ మున్సిపల్ అధికారులు దేవాలయం ఆఫీసర్లతో చర్చించి ఈ నిర్ణయాన్ని తీసుకున్నారు. చూద్దాం మరి పూరీ దేవాలయం సాత్విక దేవాలయంగా మారుతుందో లేదో!

— జూపిటర్

వేయడంలేదు.

అందరికీ చెమటలుపట్టేస్తున్నాయి! రెప్ప వేయడం, వూపిరితీయడం మరచి శిలా ప్రతిమల్లా వుండిపోయారు అందరూ...

ఇంతలో బాబు కళ్లు తెరిచాడు. కాళ్లు చేతులు చిన్నగా కదిల్చేడు. ఆ చిరుచప్పుడికి పాము బాబువైపు తన దృష్టిని కేంద్రీకరించింది. బాబు తన తల్లి కనపడకపోవడంతో "ఊ... ఉంగా" అంటూ ఏడవబోయాడు. అంతే పాము తన పడగని బాబువైపు విసిరింది. కాని... పాము తన పడగని బాబు వైపు విసరబోతున్న క్షణంలో, ఓ మొరటైన హస్తం పాము తలని బంధించింది. ఆ చెయ్యి గోచీ ధరించిన వ్యక్తిది. అతను రెప్పపాటులో పాముదగ్గరకి చేరి ఒడుపుగా దాని తలని పట్టేసుకున్నాడు.

అతను ఎడమ చేత్తో పాము తలని పట్టుకుని కుడిచేత్తో దాని శరీరాన్ని పట్టుకుని బయటకు తీసుకువస్తున్న క్షణంలో... బలమైన ఆ నల్లత్రాచు కోపంగా తన తల విదుల్చుకోగా... ఆ వ్యక్తి చేతిపట్టు కొద్దిగా సడలింది. అంతే! పాము నగ్నంగా ఉన్న అతని పొట్టమీద తన కోరల్ని దించింది!

అతను కంగారుగా పాముని వదిలేశాడు. అప్పటికి కర్తవ్యం గుర్తొచ్చిన పాములవాళ్లు క్షణంలో పాముని చంపేశారు.

అనసూయ ఒక్క అంగలో మంచం దగ్గరకెళ్లి... బాబుని గుండెలకు హత్తుకుని... ఆప్యాయంగా ఒళ్లు తడుముతూ... సంతోషంగా ఏడ్చేయసాగింది.

"పాము కాటేసింది. ఆ మనిషిని వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లండి..." అన్నాడు రాఘవరావు. అప్పటికప్పుడు రిక్షా తీసుకొచ్చి 'అతన్ని' ఆస్పత్రికి తీసుకెళ్లారు.

"అనసూయా, ఆ ఏడుకొండలవాడు 'అతని' రూపంలోవచ్చి మనబిడ్డని కాపాడేడు. అతని ఋణం ఎన్ని జన్మలెత్తినా తీర్చలేం! కాని... పాపం అతన్ని పాము కరిచింది..." భార్యతో అన్నాడు రాఘవరావు.

"నిలువుదోపిడీ ఇస్తానని వేంకటేశ్వరునికి మొక్కుకున్నానండి. నా మొర ఆలకించి ఆయనే బాబుని రక్షించాడు." భక్తిగా కళ్లు మూసుకుని అంది అనసూయ, బాబుని మరింత తనహృదయానికిహత్తుకుంటూ...

"ఈ వేళ ప్రయాణం సాగదనుకున్నాను. కాని ప్రయాణానికి ఇంకా చాలా టైముంది. బట్టలు సర్దు..." స్థిమితపడుతూ అన్నాడు రాఘవరావు.

◇ ◆ ◇

తిరుపతిలో బాబుకి పుట్టు వెంట్రుకలు తీయించడమే కాక తను 'నిలువుదోపిడీ' ఇచ్చి దేవుడి మొక్కు తీర్చుకుంది అనసూయ. లక్షరూపాయలు ఖరీదు చేసే బంగారాన్ని సంతోషంగా దేవుడికి సమర్పించి భక్తిగా చేతులు జోడించింది అనసూయ.

తిరుపతే కాక శ్రీశైలంలాంటి పుణ్యక్షేత్రాలన్నింటిని దర్శించుకుని పది రోజుల తర్వాత ఇంటికి తిరిగి వచ్చేరు అనసూయ, రాఘవరావు!

"ప్రయాణం బాగా జరిగిందా... అయ్యగారూ?" రాఘవరావు చేతిలోని సూట్‌కేస్ అందుకుంటూ అడిగేడు రంగడు.

"అంతా బాగానే జరిగింది. అంతా బావున్నారా?" అడిగాడు రాఘవరావు.

"బాగానే వున్నాం అయ్యగారు... కాని

మన బాబుని రక్షించిన 'అతను' చనిపోయేడు..."

"అవునండి. పాపం! కడుపుమీద కాటేసింది కదండి, ఆ మాయదారిపాము కనీసం కట్టు కట్టడానికి కూడా వీలులేకపోయింది. డాక్టర్ వచ్చేసరికి ఆలస్యమైంది. అప్పటికే విషం ఒళ్లంతా పాకేసిందట. డాక్టర్ ఎంత ప్రయత్నించినా బతికించలేకపోయారు. రెండు రోజులు మంచంలో నరకం అనుభవించి మూడోరోజు ప్రొద్దుటే మరణించాడు" అన్నాడు రంగడు.

"శివశివా!" అంది అనసూయ.

"అయ్యో... పాపం!" నిట్టూర్చాడు రాఘవరావు.

"రెక్కాడితేకాని డొక్కాడని కుటుంబం! అతనికి ఇద్దరు పిల్లలు, భార్యా వున్నారు. అతని భార్య ఎప్పుడూ కూలిపనికి వెళ్లి ఎరుగదు. ఇక ఆమె బతుకంతా కష్టాలే..." జాలిగా అన్నాడు రంగడు.

"ఆ కర్మ అతనిదికాదు! ఆ పెళ్లానిది, ఆ పిల్లలదీనూ..." అంది అనసూయ.

"రంగా... ఓసారి అతని పెళ్లాన్ని రమ్మను..." అన్నాడు రాఘవరావు.

"అలాగేనండి..." అన్నాడు రంగడు.

◇ ◆ ◇

మర్నాడు...

"అయ్యగారు... 'అతని' భార్య వచ్చింది" అన్నాడు రంగడు. అనసూయ, రాఘవరావు బయటకు వచ్చారు.

గుమ్మం దగ్గర నిలబడి వుందో పాతికేళ్ల యువతి. ఆమె చంకలో సంవత్సరం వయసున్న పిల్లాడు... ప్రక్కన ఎముకల గూడులా వున్న నాలుగేళ్ల పిల్ల నిలబడి వుంది.

ఆమె మదురు సూర్యుదులేని ఆకాశంలా వెలవెలబోతోంది. మాసిన తెల్లచీర, గాజులులేని బోడిచేతులు, కాటుకలేక పాలిపోయిన కళ్లు... ఆమెని 'విధవ'గా చాటుతున్నాయి. ఆమె శరీరం తిండిలేక దిగులుతో చిక్కి శల్యమైంది.

"మీ ఆయిన విషయం రంగడు చెప్పే



ని కష్టమే వచ్చింది. ఇలాంటి సమయంలోనే ధైర్యంగా వుండాలి'' అంది అనసూయ.

ఆమె తలదించుకుంది. రెండు కన్నీటి బొట్లు ఆమె కళ్లనుండి జారి భూదేవిని అభిషేకం చేశాయి.

''ఎంతో ధైర్యంగా మా బాబుని కాపాడేడు. మేము యాత్రలకి వెళ్లడం వల్ల అతను పోయేదన్న సంగతి మాకు తెలియలేదు'' జాలిగా అన్నాడు రాఘవరావు.

భర్త గుర్తుకు రావడంతో ఆమె దుఃఖం ఎక్కువైంది. ఆమె డొక్కలు ఎగిరెగిరి పడుతున్నాయి. నుంచోడానికి శక్తి లేనిదానిలా క్రింద కూర్చొబడిపోయింది. ఆమె ప్రక్కనే నిలబడి వున్న పిల్లకూడా క్రింద కూర్చుంది.

రాఘవరావు ఇంట్లోకి వెళ్లాడు. భర్త ఎందుకు లోపలికి వెళ్లాడో అర్థమైన అనసూయ తనుకూడా లోపలికి నడిచింది.

ఇనప్పెట్టె తలుపుతీసి నోట్లులెక్కపెడుతున్న రాఘవరావునిఅడిగింది అనసూయ...

''ఎంతిస్తున్నారు?''

''వెయ్యి రూపాయలు''

''వెయ్యి రూపాయలే? మీకుగాని మతిగాని పోయిందా? అంత డబ్బు వాళ్లకి ఇవ్వడానికి ఇక్కడ చెట్లకు కాస్తోందా డబ్బు?–'' కోపంగా అంది అనసూయ.

''అతను మన బాబుని రక్షిస్తూ మరణించాడే'' అన్నాడు రాఘవరావు.

''అది మీ భ్రమ. అతనికి చావు అలా వ్రాసిపెట్టుంది. అలా జరిగింది. వందరూపాయలివ్వండి చాలు'' అంది అనసూయ.

''మరీ అంత తక్కువా?'' అయిష్టంగా అన్నాడు రాఘవరావు.

''తక్కువో... ఎక్కువో... మనం ఇవ్వ

...గురించి అంతా!'' అంది అనసూయ.

వంద నోటు పట్టుకొచ్చి... ఆమెకి ఇస్తూ...'' ఏ ఖర్చుకైనా ఉపయోగపడుతుంది... వుంచు'' అన్నాడు రాఘవరావు.

''వద్దండి... మా ఆయన చేసిన మంచి పనిని నేను డబ్బుకి అమ్ముకోలేను'' అందామనుకుందామె. కాని అనడానికి ఓపికలేక ''వద్దు... వద్దండి...'' అని మాత్రం అంది.

ఆమె కూతురికి తల్లి ఏదో వద్దంటోందని అర్థమైంది... ''అమ్మా ఆకలే...'' తల్లిని తడుతూ అందా పిల్ల!

ఆమె సందిగ్ధంలో పడింది.

అభిమానానికి పోయి వందరూపాయల్ని 'వద్దు' అనాలా?

అభిమానం చంపుకుని, వంద పుచ్చుకుని... పిల్లలకి నాలుగు రోజులపాటు తిండిపెట్టాలా?

ఎప్పటిలానే... చివరికి అభిమానాన్ని ఆకలి గెల్చేసింది!

''తీసుకోమ్మా! ఫర్వాలేదు'' అన్నాడు రాఘవరావు.

ఆమె ఆ నోటు పుచ్చుకుని, చేతులు జోడించి వెనుదిరిగింది.

◇ ◆ ◇

''కోట్లకు పడగలెత్తిన నా శిలావిగ్రహానికి లక్ష రూపాయలు!

తన ప్రాణాలర్పించి బాబుని కాపాడిన నా ప్రతిరూపమైన పేదోడి కుటుంబానికి వందరూపాయలు!

తరాలు మారినా, యుగాలు మారినా... మారని మనుషుల మనస్తత్వానికి నాకు నవ్వొచ్చింది దేవి!'' అన్నాడు విష్ణుమూర్తి... లక్ష్మీదేవితో!

◇ ◆ ◇